
నవరాత్రి ప్రత్యేకం

అక్టోబర్ 2022

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక



## కంచి కామాక్షి

శ్రీవిద్యకు సంబంధించిన దేవాలయాలు

పీఠంలో వినాయక చతుర్థి మరియు నవరాత్రి ఉత్సవాలు

## సాధన

అనేక సమస్యల పరిష్కారానికి లలితా సహస్రనామ సంపుటీకరణ

## చక్షుష్మతీ విద్య

కంటి సమస్యలకు అద్భుత పరిహారం



# బాలా త్రిపుర సుందరీ ధ్యానము

ఆయీ ఆనందవల్లీ అమృతకరతల్లీ, ఆదిశక్తీ పరాయీ
మాయా మాయా స్వరూపీ స్ఫటిక మణి మయీ మాతంగీ షడంగీ |
జ్ఞానీ జ్ఞాన స్వరూపీ నళిన పరిమళీ నాద ఓంకార యోగీ
యోగీ యోగాసనస్థా భువనవశకరీ సౌందరీ ఐం నమస్తే || 1 ||

బాలా మంత్రే కటాక్షీ మమ హృదయ సఖీ ముక్తభావ ప్రచండీ
వ్యాళీ యజ్ఞోపవీతీ వికట కటి తటీ వీరశక్తి ప్రసాదీ |
బాలే బాలేందు మౌళే మదగజ భుజ హస్తాభిషేక్త్రీ స్వతంత్రీ
కాళీ త్వాం కాలరూపీ ఖగ గలనహృదీ, కారిణీం క్లీం నమస్తే || 2 ||

మూలాధారే మహిమ్నీ హుతవహనయనీ మూలమంత్రీ త్రినేత్రీ
హారాః కేయూరవల్లీ అఖిల సుఖకరీ అంబికాయాః శివాయా |
వేదే వేదాంతరూపీ వితత ఘనతటీ వీరతంత్రీ భవానీ
శౌరీ సంసార యోనీ సకల గుణమయీ తేద్య శ్రీం సౌః నమస్తే || 3 ||

ఐం క్లీం సౌః సర్వమంత్రే మమ వర శుభకరీ అంగనా చేష్టితాయా
శ్రీం హ్రీం క్లీం బీజముఖ్యైః దినకర కిరణైః జ్యోతిరూపే శివాఖ్యే |
హ్రాం హ్రీం హ్రూం హేమవర్ణే హిమకర కిరణా భాసమానేందుచూడే
క్షాం క్షీం క్షూం క్షౌమవాసే సకల జయకరీ శక్తి బాలే నమస్తే || 4 ||

# గురువాణి

విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -1 సంచిక - 2, అక్టోబర్ 2022

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రిక ను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter | Follow on Facebook | Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్** (సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I, Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

**ఈ సంచికలో** | **పేజీ**

**కవర్ పేజీ చిత్రము**
కాశీలో గంగా నదీ తీరంలో గురూజీ

**ధ్యానం**
బాలా త్రిపుర సుందరి 02

**గురువాణి**
గురూజీ సందేశము 04

**శ్రీవిద్యా సాధన**
శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర సంపుటీకరణ 07

**నివారణోపాయములు**
చక్షుష్మతీ విద్య 09

**శ్రీవిద్యా మందిరాలు**
కంచి కామాక్షి 10

**జరిగిన కార్యక్రమాలు** 12

**రాబోయే కార్యక్రమాలు** 13

**సాధకుల అనుభవాలు** 14

**ప్రశ్నలు – సమాధానములు** 16



# గురువుగా అమ్మ ఆరాధన

**శ్రీ గురు కరుణామయ** *( గురూజీ ప్రవచనాల నుండి)*

విశ్వమాతను రెండు విధములుగా ఆరాధించవచ్చును.

1. అమ్మయే మనకు గురువు. మనం పలికే స్తోత్రములన్నింటిలో కూడా, భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను మనం శాంతితో సుఖంగా జీవించడానికి కావలసిన మార్గముల గురించిన సూచనలు మనం పొందుతాము.

2. అమ్మ అంటే మనలను రక్షించే దేవత.అమ్మను ఒక దేవతగా పూజించి, ఆమె మనలను అనేక రూపాలలో గమనిస్తూ ఉంటుందనే నమ్మకంతో మనం ఆవిడ స్తోత్రాలను చదివి, పూజలను చేస్తూ ఉంటాము.

లలితా సహస్రనామంలో "సర్వాయుధధరా, శుక్లసంస్థితా, సర్వతోముఖీ," అని చెప్పినట్లు, మనలకు సద్బోధ చేసి, మనలను రక్షించడం కోసం అమ్మ తన చేతులలో అనేక ఆయుధాలను ధరించి మనకు (అనేక చిత్రాలలో చూపించినట్లు) కనపడుతూ ఉంటుంది.

(A) అమ్మను మనం ఒక గురువుగా ఆరాధించినప్పుడు –

**(1) సర్వాయుధ ధరా** – మనం మన చుట్టూ పక్కల ఉండే ప్రపంచం వల్ల కలిగే వికారాలను, అవరోధాలను ఎదుర్కొనే శక్తి కలిగి యున్న ఆయుధాలను పొంది ఉండాలి.

## గురువాణి

### గురూజీ సందేశము



ఒక్కొక్క ఆయుధంలో ఒక్కొక్క తత్వం దాగి ఉంటుంది. కోపాన్ని ఎదుర్కొనటానికి ఓర్పు కలిగి ఉండాలి. పగను జయించాలంటే హద్దులు లేని ప్రేమ కలిగి ఉండాలి. లక్ష్య సాధన కోసం సరియైన లక్ష్యం కలిగి ఉండాలి(దీనిని సూచించేదే అమ్మవారి చేతిలోని బాణము). సమస్యలను ఎదుర్కొనటానికి స్థిరమైన, బలమైన చిత్తము కలిగి ఉండాలి ( దీనిని సూచించేదే అమ్మవారి చేతిలోని గద). ప్రపంచములోని దుష్ట శక్తులనుండి నిన్ను నువ్వు కాపాడుకోవటానికి ఒక కవచము కలిగి ఉండాలి(దీనిని సూచించేదే అమ్మవారి చేతిలోని డాలు). ఇదే విధంగా, అమ్మవారి చేతులలో ఉన్న అన్ని ఆయుధాలు కూడా, ఇటువంటి గుణాలను మనలో పెంపొందించుకోవాలని తెలియజేస్తూ ఉంటాయి.

**(2) శుక్ల సంస్థితా**-మనం, పాలు లేదా తేనె ఎంత శుద్ధంగా ఉంటాయో అంత స్వచ్ఛంగా ఉండే **ఎరుక** (జాగరూకత) కలిగి ఉండాలని అమ్మ చెబుతున్నది. అలా ఉన్నప్పుడు మాత్రమే ("పూర్ణమదః...." అన్నట్లు) అమ్మ యొక్క సృష్టిని సరిగా చూడగలుగుతాము. దేనినైనా మార్చడానికి మనం ఏమీ చేయనక్కరలేదు. ఈ స్థితిలో ఈ భూమి మీదనే స్వర్గం ఉన్నట్లు మనకు అనుభవానికి వస్తుంది. అప్పుడు మనం మణిద్వీపం అని వేరే స్తోత్రం చదవనక్కరలేదు.

మన ఇంటిలోనే మనం జీవించే ఈ సమాజంలోనే మణిద్వీపాన్ని చూడవచ్చును. మనసు, ఎరుక, ఆలోచన, భాష, మనం చేసే ప్రతి పనిలో కూడా శుద్ధత కనపడుతూ ఉంటుంది. అమ్మను **శుక్లసంస్థితా** అని మనం తలచుకున్నప్పుడు ఈ అర్థం స్ఫురణకు రావాలి.

**(3) సర్వతోముఖీ** – ప్రపంచమునుండి జ్ఞానమును స్వీకరించేది ముఖము. మనలో అయిదు తత్వములు ముఖ భాగంలోనే ఉంటాయి. వీటి గురించి తెలుసుకునేందుకు మనం సిద్ధపడి ఉండాలి. త్యాగరాజు, "ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు" అని గానం చేశారు. అదే విధంగా, **ఏమీ వ్రాయబడని పలక లాగా మన మనసును స్వచ్ఛంగా ఉంచుకొంటే, మన జీవితంలోని ప్రతి సంఘటన నుండి మనం నేర్చుకోవచ్చును.** ప్రతి ఒక్క సంఘటన ద్వారా అమ్మ మనకు ఏదో ఒక విషయాన్ని బోధిస్తూ ఉంటుంది. అది మంచి కావచ్చు, లేదా చెడు కావచ్చు. అది మంచిదా చెడ్డదా అనే విషయం, మన మనసు దానిని స్వీకరించే పద్ధతిని బట్టి ఉంటుంది. మొత్తం మీద ఆ సంఘటన మనకు కొంత బోధించడానికే జరుగుతుంది. **సర్వతోముఖీ** అనగా ప్రతి ఒక్కరి నుండి జ్ఞానమును స్వీకరించడమే. అవతలి వ్యక్తి..., ఎప్పుడూ మిమ్మల్ని ఏడిపించే మీ అత్తగారు కావచ్చు, ఎల్లప్పుడూ మిమ్మల్ని సంతోషపెట్టే మీ మనవడు కావచ్చు. ప్రతి సంఘటన కూడా మనకు ఒక పాఠాన్ని చెబుతుంది.

అందువల్ల అమ్మను గురువు లాగా ఎప్పుడైతే ఆరాధిస్తామో, అప్పుడు, భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలలో ప్రశాంతంగా ఉండటానికి కావలసిన లక్షణాలు మనం అలవరచుకునే అవకాశం లభిస్తుంది.

(B) అమ్మను, మనలను రక్షిస్తూ, మనకు వరాలనిస్తూ, అనేక సమస్యలనుండి మనలను రక్షించే ఒక దేవత లాగా భక్తితో పూజించినప్పుడు –

**(1) సర్వాయుధ ధరా** – "బాధ పడవద్దు నాయనా! నిన్ను రక్షించడానికి నేను ఇక్కడే ఉన్నాను" అని చెబుతూ, అమ్మ కుడికాలు కిందనుంచి, ఎడమకాలును మడిచి ఉంచుతున్నది. కుడి కాలు అనగా భోగము అని, ఎడమ కాలు అనగా మోక్షము అని చెప్పబడినది. వేరే పద్ధతులలో వివరించే వారి వివరణల జోలికి మనం పోవద్దు.

క్రిందకు ఉన్న కాలు భోగాన్ని సూచిస్తుంది. దీనిని చేరుకోవడం చాలా సులభం. అనగా భోగాన్ని అందుకోవడం చాలా సులభం. అమ్మ, మనలను భోగంలో పడవేసి, తద్వారా మాయలో మునిగేటట్లు చేస్తుంది. మాయ, కర్మలకు కారణం అవుతుంది. "పునరపి జననం, పునరపి మరణం" అని చెప్పినట్లు, ఈ కథ మరలా మరలా నడుస్తూనే ఉంటుంది.

పైకి మడిచి ఉంచిన కాలు మోక్షాన్ని సూచిస్తుంది. దీనిని చేరుకోవడం చాలా కష్టం. సాధారణంగా మన దృష్టి క్రిందకు ఉన్న కాలివైపుకే పోతుంది. జీవుడు భోగము వైపు ఎక్కువగా ఆకర్షితుడవుతాడు కనుక ఇలా జరుగుతుంది. "బాధ పడవద్దు నాయనా! నా పది చేతులలో ఆయుధాలు ధరించి నిన్ను రక్షించడానికి నేను ఇక్కడే  ఉన్నాను" అని అమ్మ చెబుతున్నట్లు అనిపిస్తుంది. అయిదు కర్మేంద్రియాలు మరియు అయిదు జ్ఞానేంద్రియాలను సూచిస్తూ, అమ్మ పది చేతులలో ఆయుధాలు ధరించి దర్శనమిస్తున్నది. కనుక అమ్మను ఎవరైతే రక్షకురాలిగా పూజిస్తారో, వారు ఈ కర్మేంద్రియాలు మరియా జ్ఞానేంద్రియాల ప్రభావానికి లోను కాకుండా సాధన సాగించడానికి వీలవుతుంది.

Guru Karunamaya

శ్రీ గురు కరుణామయ

# శ్రీ లలితా సహస్ర నామ సంపుటీకరణ

**మన జీవితాలలో ప్రత్యేకమైన కొన్ని సమస్యలను సాధించడానికి ఉపయోగించే ప్రత్యేక పద్ధతియే సంపుటీకరణ.**



మన జీవితాలలో ప్రత్యేకమైన కొన్ని సమస్యలను సాధించడానికి ఉపయోగించే ప్రత్యేక పద్ధతియే సంపుటీకరణ.

ఉద్యోగ సమస్య, పెళ్లి కాకపోవడం, పిల్లలు పుట్టకపోవడం వంటి సమస్యలకు ఈ సంపుటీకరణం ఉపయోగపడుతుంది. ఈ లలితా సహస్రనామ సంపుటీకరణం ఒక ప్రత్యేక పద్ధతిలో చేయవలెను. ఏదైనా సమస్య నివారణకు సంబంధించిన పాదమును ముందు చెప్పాలి. తరువాత లలితా సహస్రనామంలోని మొదటి పాదం చెప్పాలి. మరలా సమస్యకు సంబంధించిన పాదం చెప్పాలి.

ఇలా చేసినప్పుడు లలితా సహస్రనామంలోని మొదటి పాదం పూర్తి అయినట్లు లెక్క. ఇదే విధంగా లలితా సహస్ర నామం లోని పాదములు అన్నీ చెప్పాలి. లలితా సహస్రనామంలో 365 పాదములు ఉన్నాయి. ప్రతి ఒక పాదానికి ముందు ఒకసారి, తరువాత ఒకసారి ముఖ్యమైన పాదమును చెప్పాలి. కనుక మొత్తం 1095 పాదములు అవుతాయి.
లలితా సహస్రనామ సంపుటీకరణ

ఉదాహరణకు, మోకాళ్ల నొప్పులు తగ్గటానికి లలితా సహస్రనామంలో చెప్పబడిన పాదము

మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా (17వ శ్లోకం, 2వ పాదం)

**సంపుటీకరణం**

మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా(17-2)
శ్రీమాతా శ్రీ మహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ(1-1)
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా(17-2)

మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా(17-2)
చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా(1-2)
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా(17-2)

మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
ఉద్యద్భాను సహస్రాభా చతుర్బాహు సమన్వితా*(2-1)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
---
---
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
కామేశ జ్ఞాత సౌభాగ్యా మార్దవోరుద్వయాన్వితా*(17-1)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
----
----
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*

---
---
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
ఆబాల గోప విదితా సర్వానుల్లంఘ్య శాసనా*(182-1)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*

మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
శ్రీచక్ర రాజ నిలయా శ్రీమత్త్రిపుర సుందరీ*(182-2)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*

మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*
శ్రీ శివా శివ శక్త్యైక రూపిణీ లలితాంబికా*(183-1)*
మాణిక్య మకుటాకారా జానుద్వయ విరాజితా*(17-2)*

లలితా సహస్రనామ స్తోత్రములో, మానవ జీవితంలోని అనేక సమస్యల నివారణకు సంబంధించిన పాదముల వివరములను మీరు **శ్రీ లలితా సహస్ర నామ సంపుటీకరణ** నుండి డౌన్ లోడ్ చేసుకొనవచ్చును.





# చక్షుష్మతీ విద్య

## తెలికపాటి మరియు తీవ్రమైన కంటి సమస్యల నివారణకు అక్షి ఉపనిషత్ లో చెప్పబడిన అద్భుతమైన ప్రక్రియ.

అక్షి ఉపనిషత్ లేదా చక్షుష్ ఉపనిషత్ లోని మొదటి భాగంలో ఈ చక్షుష్మతీ విద్య ఉన్నది. ఇది కృష్ణ యజుర్వేదానికి సంబంధించినది. ఇది సూర్యభగవానుని సంభాషణ. దీనిలో సూర్యభగవానుడు ఆత్మజ్ఞానము గురించి చెప్పుచున్నాడు.

ఇది రెండు భాగములుగా ఉన్నది. మొదటి భాగమునందు చక్షుష్మతీ విద్య గురించిన వివరణ ఉన్నది. రెండవ భాగమునందు, ఆత్మ మరియు బ్రహ్మల యొక్క ఏకత్వము గురించి, యోగము గురించి, లక్ష్య సాధనకోసం ఏడు సోపానాల గురించి, మరియు ఓంకార మంత్రము గురించి వివరించబడింది.

చక్షుష్మతీ విద్య అనగా సూర్యుని కోసం చేసిన ప్రార్థన. సత్యమును తెలియజేసి, నిర్లక్ష్యమును తొలగించి, స్వచ్ఛంగా తయారు చేసే విద్యయే చక్షుష్మతీ విద్య. సూర్యుడు అనగా హంసరూపము. ఆయన ప్రాణులందరికీ ప్రాణశక్తిని ఇచ్చేవాడు. ఉపనిషత్తులను నిర్ణయించేవాడు. నేత్ర శక్తిని పెంపొందించేవాడు. మనసుకు శాంతినిచ్చేవాడు. అటువంటి సూర్యునికి నమస్కారము అని చెప్పే విద్యయే చక్షుష్మతి విద్య.

నేత్రముల యొక్క సూక్ష్మ సమస్యలు మరియు  సుదీర్ఘ సమస్యలు రెండింటినీ తగ్గించి, అంతర్ దృష్టిని పెంచే మంత్రమే చక్షుష్మతీ మంత్రము.  పూర్వ జన్మమునుండి ఉన్న పాపకర్మలను తొలగించి, నా నేత్రములకు కాంతిని ప్రసాదించి, నేత్ర సంబంధమైన బాధలను తగ్గించు స్వామీ అని అనుకుంటూ, ఈ మంత్రం సాధన చేస్తారు. ఈ మంత్ర ఫలశృతిలో చెప్పబడినట్లు, ఎవరైతే ఈ ఉపనిషత్తును ప్రతి రోజూ పారాయణ చేస్తారో, వారు నేత్ర సంబంధములైన బాధలనుండి విముక్తి పొందుతారు. వారి పరివార సభ్యులు కూడా ఈ సమస్యలనుండి నివారణ పొందుతారు.

వెండి,రాగి లేదా ఇత్తడి గిన్నె లేదా గ్లాసులో నీరు తీసుకుని, ఈ చక్షుష్మతీ మంత్రమును పఠిస్తూ, ప్రతి ఒక్కసారి ఒక ఉద్ధరిణ నీటిని ఆ పాత్ర లోనుండి తీసుకుని, మరలా ఆ పాత్రలోనే వదులుతూ, 12 సార్లు ఈ మంత్రమును పఠించడం చేయాలి. ఇలా చేయటం వలన ఈ నీరు శక్తిని పొంది, మందులాగా పనిచేస్తుంది. ఈ నీటి నుండి కొన్ని చుక్కలు నీటితో నేత్రములను తుడుచుకోవాలి. మిగిలిన నీటిని తీర్థంగా స్వీకరించాలి.

చక్షుష్మతీ మంత్రము మరియు చక్షుష్మతీ ఉపనిషత్ - ఇవి రెండింటి స్క్రిప్ట్ లు , ఆడియో మరియు వీడియో ఫైల్స్ Srimeru website నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చును.

గురూజీ చెప్పిన  చక్షుష్మతీ ఉపనిషత్ ఆడియో వినండి.





# కంచి కామాక్షి ఆలయం

**అనేక ఆలయములతో నిండి ఉండి, అనంతమైన ఆధ్యాత్మిక శక్తి కలిగి ఉండి, "నగరేషు కంఛి"  అని పిలువబడే నగరము కంచి. కంచి మరియు కామాక్షి పదములు రెండూ పర్యాయ పదములుగానే భావిస్తాము.ఈ నగరాన్ని "మోక్షపురి" లేదా "ముక్తిస్థలి" అని కూడా అంటాము. అనుకోకుండా కంచిని దర్శించిన వారికి కూడా ముక్తి లభిస్తుందని పెద్దలు చెబుతారు.**

అయోధ్యా  మధురా మాయా కాశీ కాంచీ అవంతికా అనే ఏడు మోక్షపురులలో, దక్షిణ భారత దేశములో ఉన్న ఏకైక మోక్షపురి కంచి.  పంచభూత స్థలులలో పృథ్వీ తత్వమునకు చెందిన క్షేత్రము కంచి.

పురాణాలలో చెప్పిన విధంగా, భండాసురుడనే రాక్షసురుడు అనేక బాదలకు గురి చేసినపుడు దేవతలందరూ శివుని సలహా మేరకు శ్రీ మహా త్రిపుర సుందరిని ప్రార్థించగా, ఆమె బిలాకాశమునుండి ప్రత్యక్షమై, రాక్షసులను సంహరించి, మరలా బిలద్వారములేనికి వెళ్లి, కంచి కామాక్షి గుడిలోని గర్భగుడిలో నివాస స్థానము ఏర్పరచుకున్నారు.  కంచి కామాక్షి ఇక్కడ పద్మాసనాసీనురాలై ఉన్నారు.

.

పురాణాల ప్రకారం 51 శక్తి పీఠాలలో, సతీదేవి యొక్క నాభి స్థానము పడిన ప్రాంతమే ఈ కాంచీపురము.

కాంచీపురము యొక్క ముఖ్య దేవత కామాక్షీదేవి. మిగిలిన ఆలయాల ఊరేగింపులు అన్నీ కూడా, అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణంగా సాగుతాయి.

కంచి కామాక్షి ఆలయంలోని ముఖ్య గర్భగుడి ని గాయత్రీ మంటపము అంటారు ఈ మంటపంలో 24 స్తంభాలు ఉంటాయి( గాయత్రీ మంత్రములో 24 అక్షరాలు ఉంటాయి).



కంచి కామాక్షీ అమ్మవారు పంచబ్రహ్మాసనం మీద పద్మాసనంలో ఆసీనురాలై ఉన్నారు. ఇక్కడ అమ్మవారు గాలిలో కూర్చుని ఉన్నట్లు చెబుతారు. నాలుగు భుజములు, మూడు కన్నులతో ఉన్న అమ్మను ఇక్కడ లలితా త్రిపుర సుందరి, శ్రీ విద్యా పరమేశ్వరి, శ్రీ చక్ర రూపిణి అని కూడా పూజిస్తారు.

కామాక్షి అనునది మూడు పదములు కలిసి ఏర్పడిన సంయుక్త పదము. కా అనగా సరస్వతి. మా అనగా లక్ష్మి మరియు అక్షి అనగా కన్నులుగా కలిగినది. ఆ విధంగా, సరస్వతి మరియు లక్ష్మీ దేవిలను తన కన్నులుగా కలిగి ఉన్న తల్లి కామాక్షి. అమ్మ కిరీటం పైన అర్ధ చంద్రాకారము అలంకరించి ఉంటుంది. చేతులలో పాశము, అంకుశము, కోదండము(చెఱకు గడ) మరియు పంచబాణ(అయిదు బాణములు) ధరించి ఉంటుంది. సూర్య చంద్రులను స్తనములుగా కలిగి ఉంటుంది.
తనను శరణాగతి పొందిన వారి అన్ని కోరికలను కామాక్షి అమ్మ తీరుస్తుంది.

గుడిలోని గర్భగృహమునందు శ్రీ ఆది శంకరాచార్యులవారు , కామాక్షీ దేవి విగ్రహము ముందు భాగములో ఒక శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ జరిగే అభిషేక కార్యక్రమము, భక్తులను మంత్రముగ్ధులుగా చేస్తుంది. అమితమైన శక్తిని ఇస్తుంది.

ఇక్కడ జరిగే అభిషేక కార్యక్రమము, భక్తులను మంత్రముగ్ధులుగా చేస్తుంది. అమితమైన శక్తిని ఇస్తుంది. గంధాభిషేకము జరిగినప్పుడు అమ్మవారు సువర్ణ కాంతులతో ధగధగా మెరిసిపోతూ దర్శనమిస్తారు.

అభిషేకము తరువాత భక్తులకు అర్చనా కుంకుమ ఇస్తారు. ఈ కుంకుమను, గాయత్రీ మండపంలో కుడివైపు ఉన్న అరూప లక్ష్మి కి బొట్టు పెట్టి, తరువాత భక్తులు తమ నొసటన తిలకంగా ధరిస్తారు. ఇలా చేయటం వలన అమ్మవారి ఆత్మసౌందర్యం గురించి అవగాహన ఏర్పడుతుంది.

ఒకసారి లక్ష్మీదేవి, నల్లగా కనిపిస్తున్న శ్రీమహా విష్ణువును ఆక్షేపించి పాపము చేయడం వల్ల ఆమె నిరాకారముగా మారిపోయి, ఆ పాప విముక్తి కొరకు అమ్మవారు ఇక్కడ ఉన్న గాయత్రి మండప ప్రాంతంలో తపస్సు చేశారని చెబుతారు. తపః ఫలం కారణంగా ఆమె శాపవిముక్తి పొంది, ముకుళిత హస్తాలతో, తిరిగి తన స్వామిని చేరుకుంటుంది. ఇలా ముకుళిత హస్తాలతో ఉన్న లక్ష్మీదేవి మూర్తి ఇంకెక్కడా కనుపించదు. అమ్మవారు తన పూర్వ రూపాన్ని ఎప్పుడు పొందతారో అని ఆత్రంతో , విష్ణుమూర్తి ఒక స్తంభం చాటున దాగి ఉండి, తపస్సు చేస్తున్న లక్ష్మీ దేవిని దొంగ చూపులతో గమనిస్తూ ఉంటాడు. ఇక్కడ అద్దంలో మాత్రమే విష్ణుమూర్తి రూపాన్ని మనం దర్శించుకోవచ్చును. దీనిలో ఉన్న అంతరార్థం ఏమిటంటే, బాహ్య సౌందర్యం నీలో గర్వాన్ని పెంచుతుంది. కానీ అంతస్సౌందర్యం ముఖ్యమైనది.

సశేషం...

# ఉత్సవాలు, కార్యక్రమాలు





## వినాయక చవితి

ఈ సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్థి నాడు శ్రీవిద్యా సాధకులందరూ, వినాయక చవితి ఉత్సవాన్ని గురూజీ పర్యవేక్షణలో అత్యంత శ్రద్ధతో నిర్వహించారు. రెండున్నర అడుగుల ఎత్తు ఉన్న విఘ్నేశ్వరుడు మరియు గౌరీ దేవి ల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి, 10 రోజుల పాటు పూజలు, హోమాలు నిర్వహించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబరు 26 నుండి అక్టోబరు 5 వతారీఖు వరకు పీఠంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రతి రోజూ చండీ హోమం, గురుమండల పూజ నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలు లైవ్ టెలికాస్ట్ చేయపడ్డాయి. సాధకులు, బెంగుళూరు లోని వివిధ ప్రదేశాలకు వెళ్లి అన్న ప్రసాద వితరణ చేసి వచ్చారు.

వివిధ దేశాలనుండి మరియు మన దేశములోని వివిధ ప్రదేశాలనుండి శిష్యులు మరియు సాధకులు ఈ కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు.







## వారాహీ నివాసం, కోయంబత్తూర్

సెప్టెంబరు 7 నుండి 9 వ తారీఖు మధ్యలో గురూజీ మరియు అమ్మాజీ కోయంబత్తూర్ లోని వారాహీ నివాసం అనే గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గృహాన్ని వాస్తు రీత్యా ఎంతో చక్కగా నిర్మించుకున్న శ్రీ పరమేశ్వరన్ రాధాకృష్ణన్ గారు, గురూజీ మరియు అమ్మాజీలను రథంలో తీసుకువచ్చి, పూర్ణకుంభంతో స్వాగతించారు.

# రాబోయే కార్యక్రమాలు




## గురూజీ పర్యటన వివరాలు

అక్టోబరు నెలలో గురూజీ ఈ క్రింది నగరాలకు పర్యటించనున్నారు. అప్పాయింట్ మెంట్ కొరకు +91 8088256632 నంబరుకు మెసేజ్ పంపగలరు.

విశాఖపట్నం – 13 నుండి 16 వ తేదీ వరకు
రాజమండ్రి – 19 నుండి 26 వ తేదీ వరకు
బెంగుళూరు – మిగిలిన అన్ని రోజులు

## కాశీ యాత్ర

అక్టోబరు 31 వ తారీఖు నుండి నవంబరు 9 వ తారీఖు వరకు గురూజీ మరియు 115 మంది శిష్యులు కలిసి, కాశీ లోని కర్నాటక స్టేట్ గెస్ట్ హౌస్ లో ఉంటారు. ఈ గెస్ట్ హౌస్ హనుమాన్ ఘాట్ కు దగ్గరలో ఉన్నది. ప్రతి రోజూ, నవావరణ పూజ, రుద్ర హోమం నిర్వహించబడతాయి. వివిధ ఆలయాలను సందర్శించటం, జపం, ధ్యానం ద్వారా సాధన చేయడం జరుగుతుంది. కార్తీక పౌర్ణమి రోజు లలితా త్రిశతి పఠిస్తూ, దుర్గా మాత సన్నిధిలో దీపాలను వెలిగించే కార్యక్రమం కూడా జరుగుతుంది.





## శ్రీ విద్యా తరగతులు

శ్రీ విద్యా తరగతుల తేదీల వివరాలు
**ఇంగ్లీష్ మాడ్యూల్** 1&2 – **నవంబరు** 11,12 **మరియు** 13 తేదీలు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు (భారతీయ కాలమానం ప్రకారం)
**తెలుగు మాడ్యూల్** 1&2 – **నవంబరు** 18,19 **మరియు** 20 తేదీలు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు (భారతీయ కాలమానం ప్రకారం)
రిజిస్టర్ చేసుకోవడానికి ఈ క్రింద లింక్ ఇవ్వబడినది.
https://srimeru.org/srividya-saadhana

# గురూజీతో నా అనుభవాలు

**మాధవి ఆతి**



శ్రీ గురుభ్యోనమః
శ్రీమాత్రేనమః

**ఐంకార హ్రీంకార రహస్య యుక్త**
**శ్రీంకార గూఢార్థమహావిభూత్యా ॥ 1 ॥**

**ఓంకార మర్మ ప్రతిపాదినీభ్యాం**
**నమో నమః శ్రీ గురుపాదుకాభ్యాం ॥ 2 ॥**

అస్మద్ గురు చరణారవిందములకు ప్రణామములర్పిస్తూ, నేను నా నూతన జీవితం లోని, సాటిలేని, విలువైన నా అనుభవాలను ఇక్కడ తెలియజేస్తున్నాను. మీరు సరిగానే విన్నారు. నా "నూతన జీవితం" అని అన్నాను. గురువర్యులను మొదటి సారి దర్శించుకున్న క్షణంలోనే నాకు పునర్జన్మ కలిగింది. దానిని పునర్జన్మ అని ఎందుకు అంటున్నానంటే, నేను మొట్టమొదటి సారి గురువు గారిని చూసినప్పుడు ( మాడ్యూల్ 1 మరియు 2 క్లాసులు), చెప్పలేని ఆనందం కలిగింది. ఈ జన్మములోను, మరణాంతరములోను నిన్ను ముందుకు నడిపించేది ఈ పాదములే అని నా అంతర్వాణి చెప్పినట్లుగా వినపడింది. అప్పటి నుండి గురువు గారితో ఒక అజేయమైన బంధం ఏర్పడింది.

జీవితంలో మార్పులను నిరోధించకుండా, ఆ జీవితం ఎలా ఉంటే అలాగే దానిని స్వీకరించడం అంటే ఏమిటో నేను తెలుసుకుంటూ, నా జీవితంలో కేవలం అమ్మయే అంతటా నిండి ఉన్నదని అర్థం చేసుకున్నాను. గురు కటాక్షంతో,నా జీవితంలో అనేక క్లిష్టమైన పరిస్థితులనుండి బయటపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2019వ సంవత్సరంలో నేను చేస్తున్న ప్రాజెక్టు ను, అనువు కాని సమయం లో పూర్తి చేయమని నా క్లైంట్ నామీద వత్తిడి తెచ్చారు. ఆ సమయంలో, నన్ను నేను నియంత్రించుకుని, ఒంటరిగా కూర్చుని, కొంత సేపు గురుమంత్రం జపించుకున్నాను. నాలో నేను గురువు గారికి నా సమస్య గురించి విన్నవించుకున్నాను.

అప్పుడే ఒక అద్భుతం జరిగింది. నా ఫోన్ రింగ్ అయింది. ఆ ఫోన్ కాల్ ఎవరిదో కాదు - సాక్షాత్తూ గురువు గారిది. గురుసేవకు సంబంధించి కొన్ని విషయాలు మాట్లాడారు. నా సమస్య గురించి గురువు గారితో ఏమీ చెప్పలేదు. కానీ కొద్ది నిముషాల తరువాత నా క్లైంట్ దగ్గర నుండి నాకు ఫోన్ కాల్ వచ్చింది. ఆయన తన విపరీత ధోరణి మరియు ప్రవర్తనకు నన్ను క్షమాపణ కోరి, ప్రాజెక్టు పూర్తి చేయటానికి నాకు వీలుగా సమయాన్ని కేటాయించారు. ఇలా జరుగుతుందని నేను ఊహించలేదు. అప్పుడు నాకు గురువు గారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "నీవు నాలుగు రోడ్ల కూడలి మధ్యలో ఉన్నప్పుడు, నీ వెనుక గోడ తప్పితే మరి ఏమీ లేనప్పుడు, నీ గురువును గుర్తు చేసుకో." అప్పటినుండి నేను గురుమంత్రమును లేదా గురు నామమును ఎల్లప్పుడూ జపిస్తూ ఉండటం అభ్యాసం చేసుకున్నాను. ఆ మంత్రమే నాకు అదృష్ట చింతమాణి.

ఆ విధంగా, నా శ్వాసతో పెనవేసుకుని ఉన్న(సోహం - హంసః) గురువు యొక్క అజ్ఞాత శక్తిని గురించి నేను తెలుసుకోగలిగాను. ఆ శక్తి, తల్లి బిడ్డను రక్షించిన విధంగా ఎల్లప్పుడూ నన్ను రక్షిస్తూ ఉంటుంది. ఆ గురు ధ్యానం వలన నా హృదయం ఆనందంతో నిండిపోయింది. ఇలా నాకు ఒక్కసారి కాదు - అనేక పర్యాయములు జరిగింది. దీని వలన నేను గురువు వద్ద సర్వస్య శరణాగతిని అనుకరించాను. ఎదురవుతున్న సంఘటనల గురించిన విశ్లేషణ చేయడం తగ్గించాను. పూర్తి నమ్మకంతో దానిని గురువుకే వదిలి వేయడం ప్రారంభించాను. నా లోని అంధకారాన్ని పారద్రోలి, నన్ను అమ్మ వద్దకు చేర్చే ఏకైక మార్గము గురువే అని నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఈ సందర్భంలో గురుగీత లోని ఒక శ్లోకం నాకు జ్ఞాపకం వస్తున్నది.

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురోః పదం ।
మంత్రమూలం గురోర్వాక్యం మోక్షమూలం గురోః కృపా

గురువు గారి సందేశములను నా జీవితంలో అనుసరించడానికి కావలసిన శక్తిని నాకివ్వమని కోరుకుంటూ, సద్గురు చరణారవిందములకు నమస్సులు.

శ్రీమాత్రేనమః

गुरु गोविन्द दोऊ खड़े, काके लागू पाय|
बलिहारी गुरु आपने, गोविन्द दियो बताय||

**శ్రీవిద్యలో "కానీ", "ఎందుకంటే", "అయితే", "కావచ్చు" వంటి పదాలకు స్థానం లేదు.**
**శ్రీవిద్య నేర్చుకోవడం అనేది నమ్మకంతో ప్రారంభం అవుతుంది. అది మనకు ఆత్మ స్థైర్యాన్ని , విశ్వాసాన్నీ పెంపొందిస్తుంది.**

**~ శ్రీ గురు కరుణామయ**

# వర్తమాన కాలంలో, కుటుంబ విలువలను, ఆధ్యాత్మికతను సమతౌల్యంగా చేసుకోవడం



**ప్రశ్న** – ఈ కాలంలో కుటుంబ విలువలు తగ్గిపోతున్నాయి. కుటుంబాలే చిన్నవిగా మారుపోతున్నాయి. కానీ, ఆధ్యాత్మిక మార్గంలో మనం విస్తరణ గురించి మాట్లాడుతున్నాము. ప్రస్తుత కాలంలో ఈ పద్ధతిలో, కుటుంబ విలువలను, ఆధ్యాత్మికతను సమతౌల్యంగా ఆచరించడం ఎలా?

**గురూజీ** – మన పురాణాలు, వైదిక శాస్త్రాలు సూచించిన ప్రకారం, యుగధర్మము లేదా కల్ప ధర్మముననుసరించి జీవన విధానం మారుతూ ఉంటుంది. ఆ విధంగా, కలియుగ ధర్మముననుసరించి విశ్వములోని ధర్మ సూత్రముల ఫలితంగా, దేశ,కాల,మాన, పరిస్థితులననుసరించి మన జీవన విధానములు ఏర్పడినవి. ప్రసార మాధ్యమాల రూపంలో మనలను ప్రభావితం చేసే అనేక అంశాల గురించి ఇక చెప్పనక్కరలేదు.

నిత్య జీవితం మరియు ఆధ్యాత్మికత – ఈ రెండింటి మధ్య సమరూపత సాధించడానికి ఏకైక మార్గము – ఈ రెండింటినీ కలపడమే. “వసుధైక కుటుంబకం” అని తెలిపిన మన వేదశాస్త్రముల ప్రకారం విశ్వమంతా ఒక కుటుంబమే. విశ్వమంతటిలోనూ దివ్యత్వాన్ని దర్శించాలని అది సూచిస్తుంది. ఈ తత్వమే, కల్లా కపటమెరుగక ఆడుకునే చిన్నపిల్లలలోను, అనుభవంతో పండిన పెద్దలలోను మనకు కనపడుతుంది. ఉదాహరణకు నొసటన తిలకం ధరించడం అనేది ఆజ్ఞా చక్రమును(రెండు కళ్ల మధ్య ఉండే శక్తి కేంద్రము) ఉత్తేజపరచడం కోసం, మరియు వ్యతిరేక శక్తుల నుండి రక్షింపబడటం కోసం చేయాలి అనే విషయం అందరికీ తెలుసును. కానీ, కొందరు పెద్దలు మాత్రమే ఈ పద్ధతిని, అది కూడా ఆలయ దర్శన సమయంలో మాత్రమే పాటిస్తున్నారు. చిన్నారులు, యువతీ యువకులు దీనిని ఒక మంచి అలవాటుగా పాటించడానికి సిద్ధంగా లేరు.

నిత్య జీవితము మరియు ఆధ్యాత్మికతల మధ్య సారూప్యత సాధించిన తరువాత, మన అనుభవాన్ని వ్యాపింపజేసుకోవచ్చును. వ్యాప్తి అనేది బాహ్యం గానూ, అంతర్లీనంగానూ రెండు విధాలుగా జరగాలి. అభివృద్ధికి ముఖ్యంగా ఉండవలసిన లక్షణం “కరుణ.” కసిని కరుణగా మార్చుకోగలగడమే అభివృద్ధి.

ఈ కరుణ తత్వము స్వంత కుటుంబమును దాటి, బంధుమిత్రులు, పెంపుడు జంతువులు, నీ చుట్టూ ఉన్న ఇతర ప్రాణుల వరకూ విస్తరించాలి. మానవాభివృద్ధి ముసుగులో వన సంహారము, వనచర సంహారము ఎక్కువ అయిపోతున్నాయి. మనం పర్యావరణ మరియు వాతావరణ పరిధులను దాటి హద్దు మీరడం వలన, ప్రకృతికి అనుగుణంగా వ్యవహరించడం, ప్రకృతిలోని జీవరాశులపై కరుణతో వ్యవహరించడం చేయడం లేదు. దీని కారణం మన జీవితాల విలువలు పలుచబడ్డాయి.

నిత్య జీవితాన్ని ఆధ్యాత్మికతతో విలీనం చేయడానికి మరొక ఉత్తమమైన మార్గం, మనం చేసే ప్రార్థనలలో నియమాలను తీసివేయాలి. అనగా, ఒక సమస్యకు సమాధానంగా ఒక పూజ చేయడం, ఒక జపం చేయడం, ఒక హోమం చేయడం వంటివి మార్చుకోవాలి. ప్రార్థన అనేది మన జీవితంలో ఒక భాగం అయి ఉండాలి.

మనకు భగవంతుడు ఇచ్చిన అనేక వరాలను గుర్తు చేసుకుంటూ మన ప్రార్థన ఉండాలి. అవకాశం ఉన్నప్పుడు, ఒక అనాథ శరణాలయం , ఒక అంధుల ఆశ్రమం వంటి ప్రదేశాలను సందర్శిస్తే, అమ్మ మనకు ఇచ్చిన బహుమతులు(పంచేంద్రియాల రూపంలో), ఇతర సౌకర్యాలు మొదలైన వాటి ప్రాధాన్యత మనకు అర్థం అవుతుంది.

వ్యక్తిగత స్థాయిలో, భార్యా భర్తలు, పిల్లలు, పెద్దలు...ఇటువంటి బంధువుల విషయాలలో మనం ఎన్నో విషయాలలో సర్దుకుపోతూ ఉంటాము. పై అధికారి దగ్గర మాట్లాడేటప్పుడు కోపాన్ని ప్రదర్శించకుండా జాగ్రత్త పడతాము. కానీ బంధువుల దగ్గర కోపాన్ని ప్రదర్శించడానికి వెనుకాడము. ఒకసారి ప్రదర్శించిన తరువాత దానిని వెనుకకు తీసుకుని, మరలా ప్రేమ ప్రదర్శించడానికి కూడా అంగీకరించము. ఇటువంటి సందర్భాలలో విశేషమైన మార్పు రావడం అవసరం.

ప్రతి ఒక్కరూ తన కుటుంబం చాలా గొప్ప కుటుంబం అని గుర్తించాలి. మంచి భార్య, మంచి భర్త, మంచి పిల్లలు.... ఈ విధంగా ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడు, ఆ వ్యక్తి శివుడవుతాడు ఆమె లలితా పరమేశ్వరి అవుతుంది. వారి అమ్మాయి బాలా త్రిపుర సుందరి అవుతుంది. వారి అబ్బాయి గణేశుడు లేదా షణ్ముఖుడు అవుతాడు. ఆ ఇల్లే కైలాసం అవుతుంది. ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఇలా ఆలోచించినప్పుడు ఇక దేవాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేయనవసరం లేదు. ఈవిధంగా, మన ఆచారాలు మరియు ధర్మముల యొక్క విలువలను మన జీవితానికి అనుసంధానం చేసుకుని, కుటుంబం నుండి విశ్వానికి ఈ భావనలను వ్యాప్తి చేసుకోవాలి.

లలితా సహస్రనామంలో "**ఆ బ్రహ్మ కీట జనని వర్ణాశ్రమ విధాయినీ**" అని చెప్పబడింది. అనగా మనం చీమల పట్ల కూడా మనం గౌరవంగా ప్రవర్తించాలని చెప్పబడింది. అయినప్పటికీ, అదే వ్యక్తి దత్తాత్రేయ స్వామి గుడిలో కుక్క రూపంలో ఉన్న విగ్రహాన్ని పూజించి, చక్కగా తయారు చేసిన ఆహారాన్ని నైవేద్యంగా ఇస్తూ ఉంటారు. కానీ ఇది మన పురాణాలలో, మన ఆచారాలలో చెప్పబడిన వాటికి ఇది వ్యతిరేకం కదా. వీధిలో ఎదురయ్యే కుక్కలకు ఇదే విధంగా చక్కగా తయారు చేయబడిన ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించడం ఎవరూ చేయరు(మిగిలిన పదార్థాలను కుక్కలకు పడవేస్తారు). విశ్వజనీనమైన ప్రేమను ఎవరైతే అలవాటు చేసుకుంటారో, వారు ఈ పనిని సులభంగా, ప్రేమతో చేస్తారు. విశ్వమంతా ఒకే కుటుంబం అని అనుకున్నప్పుడు, కుటుంబ విలువలు తిరిగి వస్తాయి.

పూర్వకాలంలో, అగ్రహారాలు ఉండేవి. ఒక వర్గానికి చెందిన అనేక కుటుంబాలు ఒకే చోట నివసిస్తూ వారు. అటువంటి చోట్ల, ఒక కుటుంబం వారు వంటలు చేసే వారు. వేరే కుటుంబం వారు వేరే పని చేసే వారు. ఇలా అన్ని పనులూ అందరూ పంచుకుని చేసేవారు. "అందరికోసం ఒక్కడు, ఒక్కడి కోసం అందరూ" అన్నట్లుగా అందరూ జీవించేవారు. ఇప్పుడా అగ్రహారాలు లేవు. ఉమ్మడి కుటుంబాలు ఎక్కడా లేవు. కనీసం అన్నదమ్ములు కూడా కలిసి నివసించడం లేదు. అలా విడిపోయి జీవిస్తున్న ఈ చిన్న చిన్న కుటుంబాలలో కూడా సంతోషం లేదు. కనుక, మన కుటుంబాన్ని వ్యాప్తి చేసుకోవడం అనగా, అందరూ నా కుటుంబంలో వారే అనే భావనను పెంపొందించుకోవడం ద్వారా వసుధైక కుటుంబకం అనే వాక్యం సత్యమై, శాశ్వతమైన సంతోషం లభించే అవకాశం ఉన్నది.

**శ్రీ మాత్రే నమః**

గురు వాక్యము

**నువ్వు కావాలనుకున్నది లభించకపోతే అది**

**నీ ఓటమి కాదు.**

**నువ్వు కావాలనుకున్నదానికోసం**

**ప్రయత్నించకపోవడమే నీ ఓటమి.**

~ శ్రీ గురు కరుణామయ


gurUvaani

Srividya Learning Centre
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org